# పారా హుషార్!

విజయవాడ ప్లాట్‌ఫారం మీద బారులు తీర్చిన సైనికుల వరుసల్లా ఉన్నాయి రైళ్ళు పొగలు కక్కుతూ. ఇన్ని రైళ్ళని చూచేటప్పటికి సుబ్బరామయ్య గారి గుండెజారుకుంది. ఏ రైలెక్కాలో పాలుపోలేదు. అంతా అయోమయం అనిపించింది. తవలా పంచెకట్టు, మల్లు లాల్చీ ఉన్న ఒకాయన దగ్గిరకెళ్ళి,

"చూడండి, మద్రాసు వైపు వెళ్ళే రైలు ఎక్కడుందండీ?"

"వల్లకాట్లో" మండిపడ్డా డాయన.

"అన్నట్టు, వల్లకాట్లో రైళ్ళలా ఉంటాయండీ?" అడిగారు సుబ్బరామయ్యగారు గడుసుగా.

"లేకపోతే ఏవిటండీ? నా డబ్బు పోయి నే నేడుస్తూంటే మధ్య మీ గోలేవిటి?"

సుబ్బరామయ్యగారికి కోపంరాలేదు. సరికదా అతనిమీద జాలేసింది. పాపం. డబ్బు పోగొట్టుకున్న బాపతు కోపంలో అతనలా విసుక్కోవడంలో ఆశ్చర్యం లేదనిపించింది.

"ఎంతపోయిందండి?"

"ఐదొందలు"

"ఎలా పోయిందండీ?"

"ఎలా పోతే మీ కెందుకండీ? మీ రేమైనా సాధించి పెడతారా? ఇదుగో చూడండి" అంటూ నైసుగా నైపుణ్యంతో కత్తిరించబడ్డ తన లాల్చీ జేబు చూపించాడు. సువర్ణసుందరిలో రాక్షసుడిలా నోరు తెరిచారు సుబ్బరామయ్య గారు. అవును మరి. ఈ బెజవాడ స్టేషనులో కళ్ళు మూసి తెరిచేలోగా నోరు ఆవలించేంత విచిత్ర పద్ధతిలో పకడ్బందీగా జరుగుతాయి దొంగతనాలు.

"పాపం విచారించవల్సిన విషయం. పోలీస్ స్టేషన్‌కి రిపోర్టివ్వండి" అని అతనిమీద సానుభూతిని ఆ సలహాలో యిమిడ్చి ముందుకు సాగిపోయారు సుబ్బరామయ్యగారు, తా నెక్కబోయే రైలును రిసెర్వ్ చేసుకుంటూ.



ప్రథమ బహుమతి రూ. 50

గుత్తుల భాస్కరరావు
ఎల్. ఈ. ఈ. రెండవ సంవత్సరం
ఎస్. ఎమ్. వి. ఎమ్. పాలిటెక్నిక్
తణుకు.

చివరికి ఎవరి సహాయం అక్కర్లేకుండానే కళ్ళద్దాలోంచి నేమ్ బోర్డు చదివి రైల్లో చొరబడి సీటు సంపాయించారాయన.

ఎంత గుంజుకున్నా యిందాకటి వ్యక్తి మనోవీధిలోంచి పోవడంలేదు. సగం నెరిసిన జుట్టుతో, ఉడిగీ ఉడగని బలంతో తెలివైన శాస్త్రిలాగే కనిపించే ఆ బుర్రమీసాల ఆసామీ మోసంలో ఎలా పడ్డాడా అని ఆశ్చర్యం వేసింది. పాపం. బాగా అనూయకు డయ్యుంటాడు.

'మనిషి ఏనుగులాఉంటే ఏం లాభం? చురుకైన బుర్రఉండాలిగాని. అయినా దొంగ జేబు కత్తిరించేటప్పుడు నిద్రపోయాడా ఏవిటి?' ఈ రకమైన ఆలోచనల్తో కొద్దిగా విజయ గర్వం కలిగిందాయనకు, అతనికిలేని జాగ్రత్త తనలో నూటికి నూరుపాళ్ళా ఉన్నందుకు.

ప్లాట్‌ఫారం కోళ్ళ ఫారంలా గోలగాఉంది. స్టేషనంతా పోర్టర్ల పొలికేకలతో, చంటిపిల్లల ఏడుపులతో, అమ్మేవాళ్ళ అరుపులతో, బిచ్చగాళ్ళ ఆక్రందనలతో తెలుగు సినిమాలోని బ్యాటిల్ ఫీల్డులా ఉంది. వచ్చే రైళ్ళు వస్తుంటే వచ్చిన రైళ్ళు పోతున్నాయి. టిక్కెట్లు ఉన్నవాళ్ళా దిగుతున్నారు. అవి లేని వాళ్ళా ఎక్కుతున్నారు.

స్టేషన్‌కి విడాకులిచ్చి రైలు బైలుదేరింది. కృష్ణవేణినిపలకరించి పచ్చటి పొలాల్లోకి దూసుకుపోయింది రైలు. ప్రకృతి సౌందర్యాన్ని తిలకించి, తలకాయని కిటికీలోంచి తీసుకుని ఆశ్చర్యపోయారాయన. తన కెదురుగా కూర్చున్నవ్యక్తి ఎవరో కాదు. ఆ డబ్బు పోయిన ఆసామీయే. పాపం. వాలిపోయిన పెరుగుతోటకూర కాడలా మొహం వేలాడేసుకూర్చున్నాడు. అపునుసరి ఒకటా? రెండా? ఐదొందలు. పరామర్శించి, ధైర్యం చెప్పకపోతే బావుండదేమోనని —

"మీ డబ్బు దొరకలేదుటండీ?"

"ఇంకెక్కడి డబ్బండీ? పోతే దొరకడంకూడానా?"

"పాపం. దురదృష్టం"

"ఇంకా నయం గిత్తలు కొనడానికి తెచ్చాను, ఐదొందలు. ఐదు వేలు తెచ్చాను కాదు ఇంజను కొనడానికి. అక్కడికి అదృష్టముండి" సుబ్బరామయ్యగారనుకున్నారు. ఈయ నేదో కాస్త గొప్ప కుటుంబీకులని. ఎలాగైనా ధనవంతుల డబ్బే యిలా దొంగల పాలవుతుంది.

"ఇందాక...కోపంలో మిమ్మల్నేవో అన్నాను....ఏవీ అనుకోకండి" అన్నాడాయన.

"అబ్బే దాన్దేంఉందండీ. డబ్బుపోతే ఎవరైనా అంతే....అన్నట్టు మీరేవూరు వెళ్తున్నారు?" అని అడిగారు సుబ్బరామయ్యగారు.

"గూడూరండి"

"నేనూ అక్కడికే. ఒకరి కొకరు జత"

* * *

ఒకాయన ప్లాట్‌ఫారంమీద పిచ్చి కుక్కలా తిరుగుతున్నాడు. ఇంకొకాయన "ఏవండీ మద్రాసు వెళ్ళే రైలెక్కడుందండీ?"

"వల్లకాట్లో"

"ఛఛ వల్లకాట్లో రైళ్ళెలా...."

"లేకపోతే ఏవిటయ్యా. నా డబ్బు పోయి నే నేడుస్తుంటే మధ్య నీ గోలేవిటి?"

ఇది బెజవాడ స్లేషన్‌లో జరిగిన సంఘటన కాదు. బిట్రగుంట ప్లాట్‌ఫారంమీద జరిగిన సంభాషణ. ఇంతకీ ఆ డబ్బు పోగొట్టుకున్నవ్యక్తి ఎవరో కాదు, సుబ్బరామయ్యగారు.

తరవాత కనుక్కోగా తెల్సింది. ఆ బొ్రమీసాలాయన రైల్వేలో పాతుకుపోయిన పెద్ద దొంగనీ, సుబ్బరామయ్యగారు అంతలావు నమ్మకస్తుడి మీద అనుమానమనేది పెట్టుకోకుండా బిట్రగుంట స్టేషన్‌లో చేతిసంచీ ఆయనకిచ్చి మరచెంబుతో మంచినీళ్ళు తెచ్చుకుందికి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటకి ఖాళీ సీటు పగలబడి నవ్వుతోందని.

***

